# అమ్మ ఎవరికైనా అమ్మ

-పిశిపాటి పద్మజారాణి

సాయంత్రం 6 గంటలు అవుతోంది. మెర్క్యూరీలైట్లు అక్కడక్కడా వెలుగుతూ మిణుగురు పురుగులను జ్ఞప్తికి తెస్తున్నాయి.

నిశ్శబ్దంగా ఉన్న టౌన్‌షిప్‌లో ఒక్కసారి కలకలం చెలరేగినట్లు పొద్దున్న వెళ్ళిన వారందరూ ప్లాంట్ నుంచి నెమ్మదిగా రాసాగారు.

పొద్దున్న డ్యూటీకి వెళ్ళిన తమ్ముడు కోసం ఎదురు చూస్తున్నాను. ఇక్కడ 'ఎ' షిఫ్టు, 'బి' షిఫ్టు, 'సి' షిఫ్టుతో పాటు జనరల్ షిఫ్టు వుంటుంది. 5 గం॥. మా వాడు జనరల్ షిఫ్టు వాడు.

స్టీల్‌ప్లాంటులో అసిస్టెంట్ మేనేజర్‌గా ట్రాఫిక్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నాడు.

పొద్దన్ననగా వెడితే వాడు సాయంత్రం దాకా రాడు.

ఇక్కడ ఎవరి భాషలూ ఒకటికాదు. అందరూ అన్నిరకాల ప్రదేశాలనుంచీ ముఖ్యంగా బీహార్, బెంగాల్, మధ్యప్రదేశ్, కేరళ... రకరకాల ప్రదేశాల నుంచి వచ్చినవారు.

వాడు డ్యూటీనుంచి వచ్చేదాకా బిక్కుబిక్కుమంటు నేనొక్కదాన్ని ఇలా వంటరిగా ఉండాల్సిందే. వాడు రావటం లేటయితే ఇలా లోపలికీ బయటికీ కాలు కాలిన పిల్లిలా తిరుగుతూ ఉంటాను.

పైగా ఈ రోజు శనివారం కావటం వలన సంత కూడా ఉంది.

ఈ స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ప్రతి శని, మంగళ, గురు



వారాలు సంత జరుగుతుంది.

ఆ సంతలో కూరగాయలే కాకుండా అన్నిరకాల వస్తువులూ దొరుకుతాయి.

అందరూ ఈ మూడు రోజుల్లోనే తమకి కావల్సిన కూరలూ, పళ్ళూ ఏవైనా కొనుక్కొని జాగ్రత్త చేసుకుంటారు.

ఆ రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కూరగాయలు అవసరం అయితే చాలా ఇబ్బంది.

అక్కడ జర్మనీ వారికి రష్యా వారికి ప్రత్యేకంగా సెక్టరు - 1 ఏ కూరగాయల మార్కెట్ ఉంది.

మంచి నాణ్యమైన సరుకు దొరికినా ఎపుడు కావాలంటే అపుడు, అధిక ధరలు ఇవ్వాలి.

పైగా సంతలేని రోజుల్లో గిరాకీ కూడా చాలా ఎక్కువే ఇంక సంతకి వచ్చే రకరకాల మనుషులూ, భాషలూ, భావాలూ, వేషధారణా... చూసి తీరాల్సిందే! అదొక చిన్న నగరంలా, దానికంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకొన్నది. అక్కడ ప్రత్యేకంగా ఓ బీచ్. అదే గంగవరం బీచ్.

ఎక్కడెక్కడో దేశం నలుమూలలనుంచీ రకరకాలైన వ్యక్తులు వచ్చి ఎన్నో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

కళాసీలు, చార్జ్‌మెన్‌లు, ట్రైనీ ఇంజనీర్, జూనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్... ఉద్యోగాలు... ఈ స్టీల్ ప్లాంట్ విశాఖపట్నంలో ఒక చోట సిటీకి దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరంలో అందంగా నిర్మితమైన బుల్లి నగరం!

ద్వారకా తిరుపతిని గుర్తుచేసే వెంకటేశ్వరుని ప్రత్యేక దేవాలయం టౌన్‌షిప్ అందాలలో ఒకటి.

చక్కగా ప్లాన్‌గా నిర్మించబడ్డ క్వార్టర్స్, దారిపొడుగునా కూర్మన్నపాలెం నుంచి టౌన్‌షిప్‌లోకి ప్రవేశించేటప్పుడు అటూ ఇటూ రహదారికిరువైపులా ఎర్రని పూలచెట్లు బెంగుళూరు మహానగరాన్ని జ్ఞప్తికి తెస్తాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే వర్ణనకి అందని అందాలను తనలో దాచుకున్నది. ఈ టౌన్‌షిప్ అందులో నా తమ్ముడు ఉద్యోగరీత్యా మేం 8వ సెక్టరులో వుంటున్నాం. ఇదీ క్లుప్తంగా.

ఇక నా గురించి చెప్పాలంటే నాది కథ కాదు వ్యథ! మాది కాకినాడని దగ్గరగా వున్న పల్లెటూరు.

నేను దీసెర్చి ఎంట్రన్స్ వ్రాయాలని, వైజాగ్ వచ్చాను.

మా వాళ్ళందరికీ అంతే మా అక్క, అన్నలకి వివాహాలు అయ్యి రకరకాలచోట్ల స్థిరపడ్డారు.

మా తమ్ముడితో చనువువల్ల మా ఇద్దరి మధ్యా వయో భేదం ఒక్క సంవత్సరమే అవ్వటంవల్ల నేను వాడి దగ్గరికి వచ్చేశాను.

మా అమ్మ ఈ మధ్యనే చనిపోయింది. ఆమె పోవటం వలన మా ఊళ్ళో ఉండబుద్ధికాలేదు.

నాన్నగారు, అత్తయ్యలు... అంతా అక్కడే ఉన్నప్పటికీ దూరంగా ఆ జ్ఞాపకాలు తుడిచేసుకుందామని ఇక్కడికి వచ్చాను.

ఏంటో అమ్మతో ఉన్న అనుబంధాన్ని వర్ణించలేను. అసలు మేం ఇద్దరం తల్లీ, కూతుళ్ళల్లా కాకుండా అక్కా, చెల్లెళ్ళల్లా ఉండేవాళ్ళం.

ఆమె అనేక విషయాల్లో నాకు స్నేహితురాలిగా, మార్గదర్శకురాలిగా, తత్వవేత్తగా అనేక సలహాలు ఇస్తువచ్చేది. ఆమెకూడా మంచి విద్యావేత్త. మంచి ఉన్నత పదవిలో సుమారు ముప్పది సంవత్సరాలపాటు ఉద్యోగం చేసింది.

చదువు విషయమేకాదు, జీవితంలో తీసుకోవాల్సిన ప్రతి నిర్ణయంలోను, వంటవార్పులు, ప్రేమానురాగాలు. ఒకటేమిటి? అన్నీ అమ్మ దగ్గరే నేను నేర్చుకున్నాను.

అలాంటి అమ్మ చనిపోవటం నాకు జీవితంలో తీరని లోటు, నా జీవితంలో మొదటి పది స్థానాలూ అమ్మకి. ఆ తర్వాతే ఎవరైనా కూడా.

అది నిజం అమ్మతో కబుర్లు చెపుతూంటే సమయం తెలిసేది కాదు. అన్నీ మనసు విప్పి చెప్పేదాన్ని. ఆమెతో మాట్లాడకపోతే తోచేదికాదు. అలా అలా పిచ్చిప్రేమ, ఆమెపై పెంచేసుకున్నాను.

ఏంటో అమ్మగానీ, ఆమె జ్ఞాపకాలు గానీ గుర్తుకు వస్తే నా కళ్ళు చెమరుస్తాయి. మా అమ్మ ప్రేమను ఎవరూ పంచలేరు.

చెడ్డభర్త, చెడ్డ సంతానం ఉండచ్చు, కాని చెడ్డ తల్లి ఉండదు.

అందుకే అంటారు. "పోయినోరు అందరూ మంచోళ్ళు ఉన్నోర్లు పోయినోళ్ళ తీపిగుర్తులు" అనీ. అది అక్షరసత్యం.

అమ్మని అనుక్షణం మరువలేక నేను పడుతున్న వ్యధే ప్రస్తుతం నా కథ. కొందరు ఒక విషయాన్ని మరవడం కోసం మార్పుకోరతారు. మార్పువల్ల మనుషులను త్వరగా మరువకపోయినా వారి వారి జ్ఞాపకాలు మరుగున పడతాయి. అంతమాత్రాన మమకారాలు తరగవు. అందుకే పదే పదే అమ్మ గుర్తుకు వచ్చినా మనస్సు కంట్రోల్ చేసుకుంటున్నాను.

సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్... అన్నాడొకవి.

కాని నా దృష్టిలో సృష్టిలో తీయనిది అమ్మ - అమ్మ ప్రేమ, నా దృష్టిలోఅమ్మ ఉన్నవారందరూ చక్రవర్తులే. డబ్బు సంపాదించచ్చు. డిగ్రీలు కొనచ్చు. కాని పోయిన మనుషుల్నీ వారి ప్రేమనూ కొనలేం. ముఖ్యంగా అమ్మనీ ఆ ప్రేమనీ... అదేపనిగా మోగుతున్న కాలింగ్‌బెల్‌కి గబగబా వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా కూరల సంచీ ఎడమ చేతిలో, హెల్మెట్ కుడిచేతిలో పట్టుకొని అలసటగా తమ్ముడు గనేష్.

వాణ్ణి లోపలికి రానిచ్చి టీ కలపటాన్కి, మంచినీళ్ళు ఇవ్వటాన్కి లోపలికి వంటగదిలోకి పరుగెత్తాను.

ఈలోగా ఎక్కడనుంచో హృదయవిదారంగా, మనస్సు కదిలించే కుక్కపిల్ల ఏడుపులాంటి మూలుగు నాకు వినపడింది.

నాకేం అర్థం కాలేదు. అంతకంతకీ ఆ ఏడుపు ఎక్కువవుతోంది.

తమ్ముడు గబగబా టార్చి తీసుకొని కిందకి వెళ్ళాడు. మేం వుండేది రెండో అంతస్థులో, కిందకి వెళ్ళిన వాడు పదినిమిషాల్లో పైకి వచ్చాడు.

ఈసారి వాడిచేతిలో చిన్నకుక్కపల్లి ఉంది. చెప్పొద్దూ... నాకూ, మా వాడికీ కుక్కలంటే తగని ప్రేమ, ముద్దు... స్కూటర్ షెడ్‌లో పడి ఏడుస్తున్నదిట. చాలా చిన్నపిల్ల. నెలరోజుల కన్నా ఎక్కువ ఉండదు వయసు. అల్సేషియన్ బ్రీడ్ అని చూడంగానే అర్థం అయిపోతుంది.

చాలా అందంగా ముద్దుగా ఉంది. మా వాడు దాన్ని ప్రేమగా నిమురుతూ "పాపం బుజ్జిముండ, చలికి వణికిపోతోంది" అన్నాడు.

నేను ఆ కుక్కపిల్లని వాడి చేతుల్లోంచి అందుకొని, "దా... దా... ఏమ్మా... ఎందుకేడుస్తున్నావురా?" అన్నాను.

అది ప్రేమగా నా చేయి నాకింది. దాన్ని రకరకాలుగా ముద్దు చేసి పాలు పోశాను.

గబగబా బిస్కెట్స్ పెట్టాను. అది తినలేకపోయింది.

## స్వపరిచయం



పేరు: పిశిపాటి పద్మజారాణి

చదువు: ఎమ్.ఎస్.సి (మేథ్స్), ఎమ్.ఇడి. ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ లో డిప్లమా, ఎమ్.ఎ (తెలుగు)

భర్త: ఈడ్పుగంట నందగోపాల్, ఎమ్.ఎస్.సి. పిజిడిసిఎ

నివాసం: రాజమండ్రి (తూర్పుగోదావరి జిల్లా)

అనుభవం: కథలు, వ్యాసాలు, కవితలు, ఇత్యాది సాహితీ ప్రక్రియలలో స్వీయరచనలుకొన్ని ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడ్డాయి.

అభిమాన రచయిత: మల్లాది వెంకట కృష్ణమూర్తి.

చిన్నపిల్లకదా మరి. ఇల్లంతా బెదురుగా తిరుగుతూ నడవలేక గుమ్మాలు దాటలేక అవస్థపడుతుంటే నాకు భలే అనిపించింది.

చాలాసేపు మేం ఇద్దరం దాంతో బాల్ ఆడాము. రకరకాలుగా ఆడి, వళ్ళో పడుక్కోబెట్టుకున్నాను. చాలా సరదా పడ్డాను. "ఒరేయ్... దీన్ని పెంచుకుందాం... నాకు బాగా నచ్చింది." అన్నాను నా ఉద్దేశ్యం బాగుందని మా వాడు అంగీకరించాడు. విశ్వాసంగల జంతువు. పైగా మగకుక్కపిల్ల. అది నా దగ్గర ఖచ్చితంగా అలవాటు అవుతుందనే నమ్మకం నాకుంది. ఆ రాత్రి అది ఏడుస్తూంటే తెచ్చి నా మంచం పక్కన వాలుకుర్చీవేసి దాన్ని అందులో పడుకోబెట్టాను. చిన్న నేప్‌కిన్ కప్పాను. దానికి అప్పటి కప్పుడు పప్పీ అని పేరు పెట్టేశాను కూడా!

ఆ రాత్రి గడిచింది. మర్నాడు అది గాభరాతో ఇల్లంతా ఖరాబు చేసింది.

అయినా నేను అసహ్యించుకోలేదు. గదులన్నీకూడా ఫినాయిల్‌తో కడిగాను.

దానికి పాలుపోసి, కొంచెంసేపు ఆడించాను. మా వాడు లేవంగానేదాన్ని విసుక్కున్నాడు.

"ఏంటది? ఇల్లంతా పాడుచేసింది? నా బూట్లు అన్నీ కొరికేసింది! ఏడుస్తూ మనకి మనశ్శాంతి లేకుండా... చేయటం... అన్నాడు.

"పోన్లేరా... చిన్న పిల్లలు అందరూ అంతేగా... ఏం మనం మాత్రం చిన్నప్పుడు తెలియక ఎంతెంత అల్లరి చేశామో... మనకి గుర్తులేదు అంతే, ఇదీ అంతే. నెమ్మదిగా అలవాటుచేస్తే ఇదీ మారుతుంది" అన్నాను. మురిపెంగా దాని చేష్టలు గమనిస్తూ...

అదిమాత్రం ఇదేంపట్టించు కోకుండా రాత్రినించి అలవాటు అవ్వటం వలన క్రాయి తాలు అన్నీ చింపేస్తోంది. వాడు ఏమనుకున్నాడో ఏమోగాని, "దీన్ని మానేజ్ చేయ గలననుకుంటే నీ ఇష్టం. నాకు అభ్యంతరం లేదు." అనేసి మళ్ళీ తన మామూలు జనరల్ డ్యూటీకి ఉదయం 9 గంటలకి బయలుదేరి వెళ్ళిపోయాడు.

వాడు అలా వెళ్ళగానే మిగిలిన వంటపూర్తి చేస్తూ రేడియో పెట్టాను. జనరంజని పాటలు వస్తూంటే పప్పీ విడ్డూరంగా తలతిప్పుతూ, తోకాడిస్తూ, రేడియో చుట్టూ తిరిగింది.

దాన్ని గమనిస్తూ ఒక పక్క వంట పూర్తి చేశాను. మధ్య మధ్య నా చుట్టు తిరుగుతూ నా కాళ్ళూ, వేళ్ళూ నాకసాగింది.

దీనికి అంతా ఒక ఆటలాగుంది. ఈలోగా నా పని ముగించుకొని నేను స్నానానికి వెళ్ళాను.

వెంటనే నేను కనపడనందుకనుకుంటా పప్పీ భయంకరంగా ఏడ్పు మొదలు పెట్టింది. దాంతో నేను ఆదరాబాదరాగా నాల్గుచెంబులలో నామకేవాస్తే... స్నానం అయ్యిందని పించుకున్నాను.

ఇది ఇక్కడ ఏడుస్తుంటే క్రింద ఎక్కడో మరొక కుక్క కూడా ఏడుస్తున్నట్లుగా నాకు అనిపించింది.

అంటే దీని ఏడుపుకి కిందనుంచి రెస్పాన్స్‌లాగా అన్నమాట. అనుమానం వస్తే నివృత్తి చేసుకోకుండా ఉండలేని చాదస్తపు మనిషిని అసలే!

పప్పీమాత్రం గాలిలోకి చూస్తూ గబగబా వాసన పసిగట్టినట్లు గాలి పీలుస్తూ తోకని విచిత్రంగా ఆడిస్తూ ఏడ్వసాగింది.

నాకయితే ఏమీ అర్థం కాలేదు. మరి అది ఎందుకు అలా చేస్తుందో నాకు అర్థం కావటాన్కి నేను దాని జాతికాదుగా... మనిషిని!!!

పప్పీ మాత్రం అంతకంతకు చాలా పరిచయం ఉన్నట్లు గాలిలోకి చూస్తూ ఏడుపుస్థాయి పెంచింది.

గబగబా తలుపుదగ్గరికి వేసి కిందకి వెళ్ళాను. మెట్లదగ్గర మరోకుక్క పెద్దది కనిపించింది.

దాని వాలకం చూస్తే పిల్లల్ని పెట్టి నెల అయి ఉంటుంది.

వెంటనే నా మనస్సులో ఓ అనుమానం వచ్చేసింది. నా ఉద్దేశ్యం ప్రకారం ఇదే పప్పీ తల్లి.

బహుశా దీని గొంతు అది గుర్తుపట్టి వాటి భాషల్లో ఏడుస్తూ పలకరించు కుంటున్నట్లున్నాయి.

అది అర్థం కావటానికి నాకు ఒక్క నిమిషం పట్టింది.

వెంటనే పప్పీని తీసికెళ్ళి తల్లి కుక్కదగ్గర పెడదాం. అనుకున్నాను.

కానీ ఏదో అపకారం చేస్తున్నానని ఆ తల్లి నన్ను కరిస్తే అందుకే అది కాదు పద్ధతి అని మళ్ళీ పైకి వచ్చి బ్రెడ్‌ముక్కలు వేస్తూ ఆ పెద్దకుక్కని మేడపైకి తెచ్చాను.

నెమ్మదిగా చిన్నకుక్క పిల్లని తలుపు తీసి ముందుకి జరిపాను.

నిజంగా ఆ సన్నివేశం ఎంత బావుందీ... అంటే కుక్కపిల్ల ఆనందంగా, గెంతుతూ పెద్దకుక్క చుట్టు తిరుగుతూ, కుయ్‌కుయ్‌మని మొరగసాగింది.

ఆ తల్లి దాని మెడనాకుతూ, గోముగా మొరుగుతూ, అదోలాంటి వింతశబ్దాలతో విచిత్రంగా దీర్ఘాలుతీస్తూ తన్మయత్వంగా కళ్ళు మూసుకుంటోంది.

దానికి నేను పెట్టిన బ్రెడ్ ఆకలి తీర్చకపోయినా దాని పిల్ల దొరికిందన్న తృప్తిలో కళ్ళు మూసుకుంది దాంతోనే దానికి కడుపునిండింది.

ఆ బుల్లికుక్క తల్లితో కల్సి ఆడుతూ, వెనకాల దిగలేక, పడిపోతూ, తల్లికాళ్ళకి అడ్డుపడుతూ బరువుగా పడిలేస్తూ కిందికి పోతోంది. నేను అలా ఉండిపోయాను.

పప్పీని బాగా చూసుకుందాం అని తెచ్చి నిన్నటినుంచి దాన్ని లాలించి, ఆడించి... ఆనందపడితే... తల్లిరాంగానే అన్నీ మరిచి అది వెళ్ళిపోతోంది.

కనీసం నా వైపుకూడా అది చూడలేదు. పొద్దున్నదాకా నా వెనకాల తిరిగి, నా వళ్ళో పడుకొని, నేను స్నానానికి వెళ్ళినా ఉండలేక ఏడ్చిన బుజ్జి పప్పీ ఇదేనా? నాతో ఆడి, ఎగిరిన కుక్కపిల్ల ఇదేనా?

కనీసం తల్లి రాంగానేనన్ను పట్టించు కోకుండా, నేను ఎవరో తెలీనట్లు వెళ్ళిపోతోంది.


అయినా లోకంలో తల్లీ, బిడ్డల అనురాగం వాత్సల్యం ముందు ఎందరి ప్రేమ అయినా బలాదూరే.

నేను దానికి తాత్కాలిమైన అమ్మ ప్రేమను అందించినా, దాని నిజమైన తల్లి వచ్చాక నేను పక్కకు వెళ్ళాల్సిందే. సమస్త జీవకోటికి అమ్మ ఎవరికైనా అమ్మ ఇది చాలా ఆలస్యంగా గుర్తించాను.

ఏదైతేఏం మంచిపని చేశాను, అనుకుంటూ లోపలికి వస్తూ అప్రయత్నంగా రోడ్డువైపు చూశాను.

దూరంగా తల్లితో కల్సి, తల్లి కాళ్ళకీ, చేతులకీ, అడ్డుపడుతూ, బరువుగా నడవలేక నడుస్తూ వెళ్ళిపోతోన్న కుక్కపిల్ల నా నీళ్ళు నిండిన కళ్ళకి మసగ్గా కనపడింది.


పిశిపాటి పద్మజారాణి
ఇ. నందగోపాల్
ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్,
హోటల్ కలింగ అప్‌స్టేర్స్,
రాజమండ్రి.






"నేను చాలా కాలం కిందట పుట్టి ఉంటే భలే బాగుండేది కదు మమ్మీ!"

"ఎందుకనిరా?"

"అప్పుడైతే ఈ 'హిస్టరీ' పాఠాలు ఉండేవి కావుగా."

-కె.రాధా(మల్లారం)
మం॥మలహర్-505 184
కరీంనగర్ - జిల్లా.




"రైలుకు, విమానానికి తేడా ఏమిట్రా?"

"రైలు యాక్సిడెంటైతే శవమైనా దొరుకుతుంది. విమాన ప్రమాదంలో అదికూడా దొరకదు సార్."

-కె.శ్రీనివాస్(మల్లారం)
మం॥మలహర్-505 184
కరీంనగర్ - జిల్లా.